రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# వరితో వర్రీ! సిరి





## నీటి గండం నుంచి గట్టెక్కించే ప్రత్యామ్నాయ వ్యూహం

★ఎల్ నినో భయాల నేపథ్యంలో రైతాంగాన్ని మేల్కొలుపుతున్న సర్కార్ ★ఒక ఎకరం వరి నీటితో 2.5 ఎకరాల్లో పంటల పండుగ.. ★పెట్టుబడి సగం, లాభాలు అదనం ★కంది, పెసర, మినుములతో మారనున్న భూస్వరూపం.. ★స్థిరమైన ఆదాయమే లక్ష్యంగా అడుగులు ★60 రోజుల్లోనే చేతికొచ్చే ఆకుకూరలు, కూరగాయలు.. ★స్థానిక మార్కెట్లలో రికార్డు ధరలు



**మాడ్గుల, జులై 17 ప్రభాదవార్త :** రాష్ట్రంలో మారుతున్న వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్నదాతలతో ప్రత్యామ్నాయ సాగు దిశగా అడుగులు వేయిస్తోంది. ఈ ఏడాది పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న బలమైన ఎల్ నినో ప్రభావం వల్ల రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉందని, తద్వారా సాధారణం కంటే తక్కువ వర్షపాతం మాత్రమే నమోదవుతుందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీనికి తగ్గట్టుగానే జులై రెండో వారంలో ఉన్నా భారీ వర్షాలు లేవు. ఈ పరిణామాలను ముందే పసిగట్టిన వ్యవసాయ అనుభవజ్ఞులు, శాస్త్రవేత్తలు కేవలం సంప్రదాయ వరి సాగుపైనే ఆధారపడటం ప్రమాదకరమని చెపుతున్నారు. వర్షాధారంగా సాంప్రదాయ వరి సాగు చేపట్టడం తీవ్ర నష్టాలకు దారితీస్తుందని వ్యవసాయ శాఖ హెచ్చరిస్తోంది. వరికి బదులుగా తక్కువ నీటితో ఎక్కువ దిగుబడినిచ్చే ఆరుతడి, కూరగాయల సాగు వైపు రైతులు దృష్టి సారించాలని ప్రభుత్వం విస్తృత ప్రచారం కల్పిస్తోంది. సాధారణంగా ఒక ఎకరం వరి సాగుకు పంట కాలంలో సుమారు 20 నుంచి 25 సార్లు నీటి తడులు ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి తోడు విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు భారీగా పెరుగుతాయి. సకాలంలో వర్షాలు పడకపోతే పెట్టుబడి కూడా దక్కకుండా పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం >>2

# శ్రమ జీవులకు ఆరోగ్య భరోసా!



**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, జులై 17, ప్రభాతవార్త :** ఒకవైపు మిరుమిట్లు గొలిపే పరిశ్రమలు.. మరోవైపు రాత్రింబగళ్లు కష్టపడే వేలాది మంది కార్మికులు. ఇది రంగారెడ్డి జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతాల నిత్య ముఖచిత్రం. అయితే, ఇంతకాలం ఇక్కడి కార్మికుడికి చిన్న ప్రమాదం జరిగినా, లేదా ఇంట్లో ఎవరికైనా అత్యవసర వైద్యం కావాలన్నా గుండెల్లో గుబులు మొదలయ్యేది. కారణం తమకు అందుబాటులో సరైన ఈఎస్ఐ ఆసుపత్రి లేకపోవడమే. ప్రస్తుతం శంషాబాద్, రాజేంద్రనగర్, షాద్‌నగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల్లోని ఫ్యాక్టరీలు, లాజిస్టిక్స్ సంస్థల్లో పనిచేసే వేలాది మంది కార్మికులు వైద్యం కోసం హైదరాబాద్ నగరానికి పరుగులు తీయాల్సి వస్తోంది. నగరంలోని ఆసుపత్రులకు వెళ్లడానికి అయ్యే ప్రయాణ సమయం, ఖర్చులు కార్మికులకు పెనుభారంగా మారాయి. అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో వైద్యం అందక ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయి. కానీ, ఇకపై ఆ కష్టాలకు కాలం చెల్లనుంది. కార్మికుల గుండెల్లో ధైర్యం నింపేలా రాష్ట్ర ప్రభుత్వం శంషాబాద్‌లో ఆధునిక సౌకర్యాలతో కూడిన 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మించబోతోంది.

**ఆశల పల్లకీ ఎక్కించిన మంత్రి ప్రకటన**

**శంషాబాద్‌లో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి!**

**వేలాది మంది కార్మికులకు తప్పనున్న వ్యయప్రయాసలు**

**చివరి దశకు చేరిన స్థల ఎంపిక, పరిపాలనా అనుమతులు**

**ఒకే చోట సాధారణ వైద్యం, సర్జరీలు, ప్రసూతి సేవలు : మంత్రి వివేక్ వెల్లడి**

**ప్రభుత్వ నిర్ణయంపై కార్మిక సంఘాల హర్షం**



రంగారెడ్డి జిల్లాలోని కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో శంషాబాద్‌లో 100 పడకల ఈఎస్ఐ (ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్) ఆసుపత్రి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలో శ్రీకారం చుట్టనుంది. హైదరాబాద్ నగరంలోని బంజారా భవన్‌లో జరిగిన నర్సింగ్ ఉద్యోగుల నియామక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ ఈ కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఉద్యోగుల ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేయడంలో భాగంగానే రంగారెడ్డి జిల్లాలో ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఆయన స్పష్టం చేశారు.

**త్వరలోనే పనులు ప్రారంభం**

శంషాబాద్ ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన కార్యాచరణ ఇప్పటికే దాదాపు పూర్తయింది. దీనికి అవసరమైన >>2

# ప్రగతి చక్రం తిప్పేదెవరు?

**అభివృద్ధికి దూరంగా మహేశ్వరం**

**నాడు తాలూకా కేంద్రం.. నేడు రాజధానికి అత్యంత సమీపం.. అయినా పంచాయతీకే పరిమితం!**

**బలమైన నాయకత్వం లేకే వెనుకబాటుతనం..**

**దేవేందర్ గౌడ్ తర్వాత ఆ శూన్యతను భర్తీ చేయని నేతలు..**

**ఉద్యమ స్ఫూర్తిని మరిచిన స్థానిక రాజకీయం..**

**ప్రజల్లో పెల్లుబుకుతున్న అసంతృప్తి**




**మహేశ్వరం, జులై 17 ప్రజావార్త:** ఒకప్పుడు తాలూకా కేంద్రంగా ఎంతో గుర్తింపు పొందిన మహేశ్వరం నియోజకవర్గం, ప్రస్తుతం హైదరాబాద్ మహానగరానికి అత్యంత సమీపంలో ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదనే చర్చ స్థానికంగా జోరుగా సాగుతోంది. ఇక్కడ బలమైన రాజకీయ నాయకత్వం లేకపోవడం, వివిధ రాజకీయ పార్టీల మధ్య సమన్వయ లోపమే దీనికి ప్రధాన కారణమని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

మహేశ్వరం నియోజకవర్గంగా ఏర్పడి దాదాపు 15 సంవత్సరాలు గడుస్తున్నా ఇక్కడ కనీస మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలు, పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం కాలేదని స్థానికులు వాపోతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హోంమంత్రిగా సేవలందించిన మాజీ మంత్రి తుళ్ల దేవేందర్ గౌడ్ చేసిన అభివృద్ధి పనులను కొనియాడుతున్నారు. ఆయన నియోజకవర్గ అభివృద్ధి కోసం చేసిన కృషిని ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారు. అదేవిధంగా, మహేశ్వరం తాలూకా ఏర్పాటు కోసం అప్పట్లో స్థానిక నాయకుడు సిరిపురం దోమ మోహన్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఉద్యమాన్ని కూడా ఈ సందర్భంగా ప్రజలు ప్రస్తావిస్తున్నారు. ఆ తర్వాత కాలంలో స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీల స్థాయిలోనే నాయకత్వం పరిమితమైందని, కానీ రాష్ట్ర స్థాయిలో మహేశ్వరం తరఫున గట్టిగా నిలబడే బలమైన నాయకత్వం కరువైందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మహేశ్వరం చుట్టుపక్కల ఉన్న అనేక గ్రామాలు మున్సిపాలిటీలుగా మారిపోతున్నప్పటికీ, మహేశ్వరం మాత్రం ఇప్పటికీ కేవలం గ్రామ పంచాయతీ గానే ఉండి పోవడం స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. అంతే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా >>2



నీటి నిల్వల సంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

# నీరు వృధా చేస్తే వినాశనమే

**శామీర్‌పేట, జులై 17, ప్రభాతవార్త :** పరిశుభ్రతతో పాటు నీటి సంరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని, ప్రతి ఇంటి వద్ద నీటి నిల్వ కోసం వర్షపు నీరు వృధాగ వెళ్లనివ్వకుండా ఆదా చేయ టంపై సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి సూచించారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో స్వచ్ఛభారత్ మిషన్ (యు)-2.0 ఆధ్వర్యంలో ఎకో వారియర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నీటి నిల్వలు, నీటి సంరక్షణపై పరికరాలతో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. వీటిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసపత్రాలను చైర్మన్ జాము రవి అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జాము రవి మాట్లాడుతూ స్వచ్ఛమైన పరిసరాలతో పాటు నీటి సంరక్షణకు కూడ అత్యంత ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరు ఇంటి వద్ద నీటిని వృధా చేయకుండా వర్షపు నీటి నిల్వ చేసి (ఇంకుడు గుంతలు) భూగర్భ జలాలను పెంపొందించటానికి చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. దీనికి ముందుగా ఈ సందర్భంగా జగ్గంగూడ జీనియస్ గ్రామర్ హైస్కూల్, అక్షర స్కూల్స్ విద్యార్థులతో పాటు లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో నీటిని వృధా చేయకుండా వర్షపు నీటిని నిల్వ చేసే విధానాలపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, స్థానిక కౌన్సిలర్లు గొంది శ్రీవాణివైద్యనాథ్, చిన్నలచ్చ సరితశ్రీనివాస్, గ్రామ మాజీ సర్పంచు సింగం అంజనేయులు, మాజీ ఎంపిటిసి నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారద రాజలక్ష్మి, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మోహన్‌సింగ్, మల్లిఖార్జున్, బిట్స్ ఫిలానీ విద్యార్థిని దీప్తి ఆదిరాజులు పాల్గొన్నారు. పలువురు విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, వ్యర్థాల నిర్వాహణతో పాటు నీటిని వృదా చేయకుండా ప్రతి ఇంటిలో వర్షపు నీరు నిల్వ (ఇంకుడు గుంతలు) చేసుకోవటం, నీటి వనరులను సంరక్షించటంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు నీటి నిల్వ, నీటి సంరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ అధికారులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# స్వామీజి ఆశ్రమంలో..

## గంజాయి సాగు!



ఆశ్రమంలో గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

**గోవిందరావుపేట శివారులో పోలీసుల దాడులు**

**40 గంజాయి మొక్కలున్నట్లు నిర్ధారణ**

**ఆశ్రమ నిర్వాహకుడు జై శ్రీరాం గిరి అరెస్ట్?**

**యాలాల జులై 17, ప్రభాతవార్త :** యాలాల మండలంలోని గోవిందరావుపేట శివారులో గంజాయి సాగు కలకలం రేపింది. గ్రామ శివారులో ఓ స్వామీజి ఏర్పాటు చేసిన ఆశ్రమంలో గంజాయి సాగు చేస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు,ఆబ్కారీ అధికారులు మూకుమ్మడి దాడులు నిర్వహించడంతో సాగు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. జై శ్రీరాం గిరి అనే వ్యక్తి గ్రామ శివారులో ఓ ఆశ్రమం ఏర్పాటు చేశారు. తాను ఏర్పాటు చేసుకున్న ఆశ్రమంలో సదరు స్వామీజి గంజాయి సాగు చేస్తున్నారనే సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మూకుమ్మడిగా దాడులు చేశారు.

ఆశ్రమం వెనకాల సుమారు 40 గంజాయి ఎండు మొక్కలను గుర్తించారు. గుర్తించిన గంజాయి మొక్కలను అధికారులు వేర్లతో సహా పెకిలించి ధ్వంసం చేశారు. ఈ ఘటనపై స్థానిక రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామ నిర్వహించారు. గంజాయి సాగు చేస్తున్న స్వామీజీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో తాండూరు రూరల్ సిఐలు పరమేశ్వర్‌గౌడు, ప్రవీణ్‌కుమార్, యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐలు రవికుమార్, నిజాముద్దీన్, తదితరులు ఉన్నారు.

**భూ రీసర్వే చేయకపోతే**

# సర్టిఫికెట్ రద్దు చేస్తా

**శిక్షణ సర్వేయర్లకు కలెక్టర్ వార్నింగ్**



మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ దీపక్ తివారీ

**వికారాబాద్, ప్రభాతవార్త :** భూ రీసర్వేకు ఆమోదం తెలపని శిక్షణ సర్వేయర్ల సర్టిఫికెట్ రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో భూ రీసర్వేపై శిక్షణ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 150 మందికి సర్వే నిర్వాహణపై శిక్షణ ఇచ్చి లైసెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందని, ఇందులో కొంతమంది భూ రీసర్వేకు ఆమోదం తెలపకుండ ఉన్నారని అట్టి వారి సర్టిఫికెట్ల రద్దుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. సంవత్సరాల క్రితం చేపట్టిన భూ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని భూ రీసర్వేకు లైసెన్స్ సర్వేయర్ల పాత్ర చాలా ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. దీర్ఘకాలిక దృక్పథంతో చేపట్టే భూ రీసర్వేకు సర్వేలో పాల్గొనడం ఉత్తమ అవకాశంగా భావించాలని, దీనివల్ల అపారమైన అనుభవాన్ని తమ జీవితాల్లో పొందుతారని కలెక్టర్ తెలిపారు. భూ రీసర్వే మూలంగా భూమి రికార్డులు పూర్తి శుద్ధి చేయబడతాయని దీనికి సంబంధిత శాఖల అధికారుల సహకారం తీసుకొని భూ రీ సర్వేలో పాల్గొనాలని శిక్షణ సర్వేయర్లకు సూచించారు. శిక్షణ సర్వేయర్లకు స్వంత మండలం కాకుండా అందుబాటులోని మండలాలకు >>2



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

## వచ్చేనెల 3 వరకూ.. సర్ గడువు పొడిగింపు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 17, ప్రభాతవార్త :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించినందున అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్‌పై ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం తెలంగాణలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఆగస్టు 3వ తేదీ వరకు గడువును పొడిగించినందున ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ ఫారాలను సక్రమంగా పూరించి నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు గడువు పొడిగింపు విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేసి, అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు అయ్యేలా సహకరించాలని వారికి ఆయన సూచించారు. బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు) ప్రజలకు అందుబాటులో ఉండి దరఖాస్తులను వేగంగా స్వీకరించి ఎన్నికల నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. ఓటరు జాబితా ప్రక్రియపై అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు.

## దర్గా బచావో - డంపింగ్ యార్డ్ హటావో

**సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ఉద్యమంలో కీలక మలుపు..**

**షాద్‌నగర్, జులై 17, ప్రభాతవార్త :** కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ వ్యవహారం రోజురోజుకు కొత్త మలుపులు తిరుగుతోంది. ఇప్పటికే రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు ఉద్యమంలో భాగమవుతుండగా, ఇప్పుడు జహంగీర్ పీర్ దర్గా పరిరక్షణ పేరుతో మైనార్టీ వర్గాలు కూడా ఉద్యమంలోకి దిగుతున్నాయి. దర్గా బచావో - డంపింగ్ యార్డ్ హటావో నినాదంతో పెద్ద ఎత్తున పోరాటాన్ని చేపట్టనున్నట్లు నాయకులు ప్రకటించారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట నాయకుడు, కొత్తూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆగిరి రవికుమార్ గుప్తా, యువ నాయకుడు ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించారు. డంపింగ్ >>2



స్థానికులతో మాట్లాడుతున్న ఖాదర్ గోరి

## బావిలో దూకి తల్లి, కుమార్తె మృతి

**చెట్టు కొమ్మను పట్టుకుని ప్రాణాలతో బయటపడిన కుమారుడు**

**కుటుంబ కలహాలతో విసిగిపోయి.. అఘాయిత్యం!**

**శంకర్‌పల్లి, జులై 17, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. వ్యవసాయ కూలీగా పనిచేస్తున్న సుధాకర్‌కు గురువారం రాత్రి భార్య వసంతతో కుటుంబ కలహం జరిగినట్లు సమాచారం. అనంతరం మనస్తాపానికి గురైన వసంత (35) తన కుమార్తె నవ్య (15), కుమారుడు వరుణ్ (10)తో కలిసి పొలం సమీపంలోని వ్యవసాయ బావిలో దూకినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో వరుణ్ బావిలోని చెట్టు కొమ్మను పట్టుకుని బయట పడడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. అయితే వసంత, ఆమె కుమార్తె నవ్య బావిలో మునిగి మృతి చెందారు. మృతురాలు వసంత స్వస్థలం వికారాబాద్ జిల్లా యాలాల మండలం సంగం గ్రామం కాగా, ప్రస్తుతం కొత్తపల్లి గ్రామంలో నివాసం ఉంటోంది. నవ్య కొత్తపల్లి పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. సమాచారం అందుకున్న శంకర్‌పల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి ఘటనపై దర్యాప్తు చేపట్టారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ తదితరులు

## అందెశ్రీ స్మృతివనం అభివృద్ధికి రూ.3.95 కోట్లు

**విగ్రహ ఏర్పాటుకు నేడు సిఎం శంకుస్థాపన**

**ఘట్‌కేసర్, జులై 17, ప్రభాతవార్త:** తెలంగాణ గీత రచయిత, కవి స్వర్గీయ అందెశ్రీ స్మృతివనాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.3.95 కోట్లు మంజూరు చేసిందని మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ తెలిపారు. ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ జంక్షన్‌లో శనివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అందెశ్రీ స్మృతివనం, విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్నారని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఘట్‌కేసర్‌లోని మేడ్చల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన హెచ్ఎండిఏ ఓఆర్ఆర్ జంక్షన్‌లో అందెశ్రీని ఖననం చేశారు. ఇక్కడ 1-22 ఎకరాల భూమిని అధికారులు కేటాయించగా అందెశ్రీ సమాది వద్ద స్మృతివనంతో పాటు ఆయన విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.3.95 కోట్లు కేటాయించగా రోడ్లు, భవనాలు, భాషా సాంస్కృతికశాఖ అధికారులు పనులను చేపట్టారు. ఈమేరకు శనివారం సాయంత్రం 5 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, కృష్ణారావు, వెంకట్‌రెడ్డిలు విచ్చేసి స్మృతివనంకు భూమిపూజ చేయనున్నారు. ఈమేరకు శుక్రవారం ఎంఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికాగుప్తా, డిసిపి సురేశ్ కుమార్, అదనపు డిసిపి వెంకటరమణ, మేడిపల్లి ఏసీపీ మోహన్‌కుమార్, కీసర ఆర్‌డిఓ వెంకట్‌రెడ్డి, ఆర్అండ్‌బి ఈఈ జలంధర్, ఘట్‌కేసర్ తహశీల్దార్ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ట్రాఫిక్ సిఐ రవీందర్‌లు ఏర్పాట్లను చేయిస్తున్నారు. విఐపిల రాక, పోలీసు బందోబస్తు, వాహనాల పార్కింగ్, షామియాల ఏర్పాటు, సభా స్థలి వద్ద అవసరమైన ఏర్పాట్లను చేశారు. మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్‌రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, అందెశ్రీ కుటుంబసభ్యులులు సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అందెశ్రీ ఉద్యమ స్ఫూర్తిని, ప్రజాచైతన్య పోరాటాన్ని ప్రజలలో చిరస్థాయిగా ఉండే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఇక్కడ స్మృతివనం, విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్నారని తెలిపారు. గురుకుల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు, హెచ్ఎండిఏ స్థలంలో 5 ఎకరాలు కేటాయించి వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, ఆర్ఓబి పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని >>2

## బోనాల ఏర్పాట్లకు సహకరించాలి

**షాద్‌నగర్, జులై 17, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్‌నగర్‌లో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24న పోచమ్మ బోనాలు, 25న మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ గంగపుత్ర సంఘం నాయకులు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫరూఖ్‌నగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు జి. సత్తయ్య మాట్లాడుతూ, బోనాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చే అవకాశం ఉన్నందున దేవాలయం పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పాటు తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రాన్ని స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, కౌన్సిలర్ మురళీ మోహన్ (అప్పి), తంగడపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్‌కు వినతిపత్రం ఇస్తున్న గంగపుత్ర సంఘం నేతలు

## శ్రమజీవులకు ఆరోగ్య భరోసా!

(మొదటి పేజీ తరువాయి)

పరిపాలనా అనుమతులు, స్థల ఎంపిక తదితర ప్రక్రియలు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. ప్రభుత్వం త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలను ముమ్మరం చేస్తోంది. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే శంషాబాద్‌తో పాటు రాజేంద్రనగర్, షాద్‌నగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, తుక్కుగూడ, పహాడీ షరీఫ్, టీచర్స్ సిటీ పరిసర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలు, తయారీ సంస్థలు, గిడ్డంగులు, లాజిస్టిక్స్ సంస్థల్లో పనిచేసే వేలాది మంది కార్మికులకు ఈఎస్ఐ వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి.

**కార్మికులకు తగ్గనున్న శ్రమ, ఖర్చు**

ప్రస్తుతం ఈ పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే కార్మికులు ఈఎస్ఐ వైద్య సేవల కోసం హైదరాబాద్‌లోని ఇతర దూర ప్రాంత ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. శంషాబాద్‌లో కొత్త ఆసుపత్రి ఏర్పాటు కావడం వల్ల కార్మికులకు ప్రయాణ సమయం, ఖర్చులు తగ్గడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో వైద్యం అందుతుందని అధికారులు భావిస్తున్నారు.

**వైద్య సేవలన్నీ ఒకే చోట!**

ఈ ఆసుపత్రిలో సాధారణ వైద్యం, అత్యవసర చికిత్సలు, శస్త్రచికిత్సలు, ప్రసూతి సేవలు మరియు వ్యాధి నిర్ధారణ పరీక్షలు వంటి అనేక సేవలను ఒకేచోట అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కార్మిక వర్గాల హర్షంజిల్లాల పునర్విభజన అనంతరం రంగారెడ్డి జిల్లాలో ప్రత్యేకంగా 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు కావడం పట్ల కార్మిక సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పరిశ్రమల సంఖ్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఆసుపత్రి ఏర్పాటు ఎంతగానో అవసరమని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా సీపీఐ కార్మిక సంఘం నాయకుడు దత్తు నాయక్ మాట్లాడుతూ.. శంషాబాద్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు నిర్ణయం జిల్లా కార్మికులకు శుభవార్త అని, వేలాది మంది కార్మిక కుటుంబాలు సమీపంలోనే నాణ్యమైన వైద్యం పొందే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగానే నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించి, ఆసుపత్రిని వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్య జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి, కార్మికుల ఆరోగ్య భద్రతకు కీలక మైలురాయిగా మారనుందని కార్మిక వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి

## ఆరుతడే సిరి!

(మొదటి పేజీ తరువాయి)

ఉంది. అందువల్ల, బోర్ బావులు లేదా చెరువుల కింద పరిమితంగా నీటి వసతి ఉన్న రైతులు సైతం వరి జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలనే ఎంచుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

**పెట్టుబడి ఖర్చు సగానికి సగం తక్కువ**

ఒక్క ఎకరం వరి పంటకు ఉపయోగించే నీటితో సుమారు 2.5 ఎకరాల్లో ఆరుతడి పంటలను లేదా కూరగాయలను అత్యంత విజయవంతంగా సాగు చేయవచ్చని అధికారులు గణాంకాలతో వివరిస్తున్నారు. వరితో పోలిస్తే ఈ పంటలకు పెట్టుబడి ఖర్చు దాదాపు 50 శాతం వరకు తగ్గుతుంది. తెగుళ్ల ఉధృతి తక్కువగా ఉండటం వల్ల దిగుబడి పరంగా కూడా నష్టపోయే ప్రమాదం చాలా తక్కువ ఉంటుందని వివరిస్తున్నారు.

**ప్రత్యామ్నాయ పంటలు ఇవే**

రైతులు వరికి ప్రత్యామ్నాయంగా కంది, పెసర, మినుము, జొన్న, మొక్కజొన్న వంటి పప్పుధాన్యాలు, ఆహార ధాన్యాల వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ శాఖ కోరుతోంది. ఇవి భూసారాన్ని పెంచడమే కాకుండా రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందిస్తాయి.

**కూరగాయల సాగుతో తక్షణ లాభాలు**

తోటకూర, పాలకూర వంటి ఆకుకూరలతో పాటు ఇతర కూరగాయల సాగు కేవలం 45 నుంచి 60 రోజుల్లోనే చేతికి వస్తూ రైతులకు తక్షణ ఆదాయాన్ని అందిస్తుంది. వీటికి స్థానిక మార్కెట్లలో ఏడాది పొడవునా మంచి డిమాండ్, మద్దతు ధర లభిస్తుండటంతో అదనపు లాభాలు పొందే అవకాశం ఉంది. రైతులకు ప్రతిరోజూ చేతికి డబ్బులు అందుతాయి. ఈ పంటలకు కేవలం మూడు నుంచి నాలుగు సార్లు జీవనాధార నీరు అందిస్తే సరిపోతుంది. కేవలం 3 నుంచి 4 తడుల నీటితోనే ఈ పంటలు గట్టెక్కుతాయి.

**క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన**

మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు తమ సాగు పద్ధతులను మార్చుకోవాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయం చేసి నష్టాల నుంచి గట్టెక్కాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. వరి వద్దు.. ఆరుతడి ముద్దు అనే నినాదంతో మండలాల వారీగా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తూ, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నారు.

## ప్రగతి చక్రం తిప్పేదెవరు?

(మొదటి పేజీ తరువాయి)

చేపడుతున్న ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికల్లో కూడా మహేశ్వరానికి దక్కాల్సిన ప్రాధాన్యత దక్కలేదని ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అవకాశాలున్నా ఉపయోగించుకోలేని పరిస్థితి..**

హైదరాబాద్‌కు అత్యంత దగ్గరగా ఉండటం, విస్తారమైన భూములు, పారిశ్రామిక అవకాశాలు, రవాణా సౌకర్యాలు అన్నీ అనుకూలంగా ఉన్నప్పటికీ.. రాజకీయ నాయకులు వాటిని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవడంలో విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రధాన పార్టీల నాయకులు రాజకీయ విభేదాలను పక్కనబెట్టి, ప్రాంత ప్రయోజనాల కోసం ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా అభివృద్ధి వేగం పుంజుకోలేదని కొందరు అంటుండగా.. గత కొన్నేళ్లలో రహదారులు, విద్యా సంస్థలు, పారిశ్రామిక పెట్టుబడులు వచ్చాయని మరికొందరు చెబుతున్నారు. ఏదేమైనా, మహేశ్వరం భవిష్యత్తు బాగుండాలంటే రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.

## భవనంపై నుండి దూకి రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

**గన్‌ఫౌండ్రి, జులై 17ప్రభాతవార్త:**

జీవితంపై విరక్తి చెందిన ఓ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి బహుళ అంతస్తుల భవనంపై నుంచి కింద దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మయూర్ కాంప్లెక్స్ చోటు చేసుకుంది. అబిడ్స్ పోలీసుల కథనం ప్రకారం.. పాతబస్తీడబీర్‌పురా ప్రాంతానికి చెందిన బాబు రావు(65) వాణిజ్య పన్నులశాలలో ప్రభుత్వ ఉద్యోగిగా విధులనునిర్వహిస్తు రిటైర్‌మెంట్ అయ్యారు.

గత కొద్ది రోజులుగా మానసికంగా కుంగిపోయారు. దీంతో జీవితంపైవిరక్తి చెంది అబిడ్స్‌లోని మయూర్ కాంప్లెక్స్ బహుఅంతస్థుపై ఎక్కి కింద దూకి ఆత్మహత్యకు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి శవ పంచనామా జరిపి పోస్టు మార్టం నిమిత్తం ఉ స్మానియా మార్చురీకి తరలించారు. మార్చురీలో మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించారు. కుటుంబ సమస్యలే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసు అబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రాజెక్టును రద్దు చేయించే బాధ్యత ఎమ్మెల్యేదే

**షాద్‌నగర్, జులై 17, ప్రభాతవార్త :** సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటుపై తుది నిర్ణయం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, షాద్‌నగర్ సీనియర్ నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఉద్యమానికి మద్దతు తెలుపుతూ ఆయన మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు సంబంధించిన జీవోను జారీ చేసింది రాష్ట్ర ప్రభుత్వమే కాబట్టి, దానిని వెంటనే రద్దు చేయాల్సిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి, సంబంధిత శాఖలతో మాట్లాడి సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను పూర్తిగా ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ప్రభుత్వం వద్ద తన పలుకుబడిని ఉపయోగించి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును రద్దు చేయిస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. షాద్‌నగర్ ప్రాంతం ఇప్పటికే పరిశ్రమల వల్ల పర్యావరణ కాలుష్యాన్ని ఎదుర్కొంటోందని, ఇలాంటి పరిస్థితుల్లో మరోసారి పచ్చని వ్యవసాయ భూముల మధ్య, జనావాసాలకు సమీపంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ప్రజల ఆరోగ్యం, భూగర్భ జలాలు, వ్యవసాయం, భవిష్యత్ తరాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిద్ధాపూర్ ఉద్యమం ఒక గ్రామానికి మాత్రమే పరిమితమైనది కాదని, మొత్తం షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని ఆయన అన్నారు. అందువల్ల రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, రైతు సంఘాలు, యువత, మహిళలు ఒకే వేదికపైకి వచ్చి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ ఈ ప్రజా ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేసిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, ప్రజల అభిప్రాయాన్ని గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో 641ను రద్దు చేసి సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు కూడా మాట్లాడుతూ, సిద్ధాపూర్ ప్రజల ఆందోళనలను ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఈ అంశంలో చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఐక్యతతోనే ఈ ఉద్యమం విజయవంతమవుతుందని, రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న బిజెపి సీనియర్ నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

## హామీల అమలుకోసం బిఆర్ఎస్ పోరుబాట..

**షాద్‌నగర్, జులై 17, ప్రభాతవార్త :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్‌ఖి పేరుతో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ విమర్శించారు. యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ చేపట్టిన యువ సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపు మేరకు, రేపు సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న యువ సంగ్రామ సదస్సుకు మద్దతుగా ఈ రోజు షాద్‌నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ బీఆర్ఎస్ యువ నాయకులు, యువ కార్యకర్తలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, నియోజకవర్గంలోని యువత, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో యువ సంగ్రామ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

**శామీర్‌పేట, జూలై 17, ప్రభాతవార్త:** అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని (లాల్‌గడిమలక్‌పేట్‌లో) 5వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు ఇవ్వాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను అలియాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. శుక్రవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ నుంచి మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ నివాసంకు పలువురు నాయకులతో కలిసి వెళ్లి సిసి రోడ్డు నిర్మాణంకు నిధులు ఇవ్వాలని వినతిపత్రాన్ని అందజేశారు. లాల్‌గడిమలక్‌పేట్‌లోని 5వ వార్డులో రోడ్డు అధ్వాన్నంగ ఉన్నట్లు సిసి రోడ్డు నిర్మాణం కోసం నిధులు కేటాయించి మంజూరు చేయాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి కోరగా ఎంపి ఈటల రాజేందర్ సానుకూలంగ స్పందించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బిజెపి మున్సిపల్ అధ్యక్షులు కొరివి కృష్ణ, జిల్లా నాయకులు కె.మాదవరెడ్డి, స్థానిక పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

## ఘనవ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెసింగ్ చేయాలి

**ఘట్‌కేసర్, జులై 17, ప్రభాతవార్త:** ఘనవ్యర్థాలను పర్యావరణహితంగా బయోమైనింగ్ ప్రక్రియను నిర్వహించాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. ఎంఎంసి ఉప్పల్ జోన్ ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్‌లోని డంపింగ్‌యార్డును శుక్రవారం ఆయన సందర్శించారు. అదనపు కమిషనర్ (హెల్త్, శానిటేషన్) రఘుప్రసాద్‌తో కలిసి కమిషనర్ డంపింగ్‌యార్డ్ వద్ద నిర్వహిస్తున్న బయోమైనింగ్ ప్రక్రియను పరిశీలించారు. మున్సిపల్ నుంచి సేకరించిన ఘనవ్యర్థాలను శాస్త్రీయ పద్దతిలో ప్రాసెస్ చేసి పర్యావరణానికి హని కల్గకుండా చేసేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్ అల్లూరి వాణి, డీఈఈ (ఎస్‌డబ్ల్యూఎం) శ్రీనివాస్, ఏఈఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్‌కు అందరూ సహకరించాలి

**ఘట్‌కేసర్, జులై 17, ప్రభాతవార్త:** ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, లోపాలు లేకుండా సాగాలంటే అన్ని రాజకీయపార్టీలు, ప్రజల భాగస్వామ్యం అవసరమని ఘట్‌కేసర్ డిప్యూటి కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి అన్నారు. ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై డీసీ అధికారులు, పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డీసీ వాణిరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా అర్హులైన ప్రతిఒక్కరికి ఓటుహక్కు కల్పించడం, జాబితాలో తప్పులను సరిదిద్దడం ఈప్రత్యేక డ్రైవ్ ముఖ్య ఉద్దేశమని ఆమె వివరించారు. బూత్‌స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆమె సూచించారు. సమగ్ర ఓటరు జాబితా రూపకల్పన కోసం రాజకీయ పార్టీలు తమ పరిధిలోని కార్యకర్తలను అర్హులైన ఓటర్ల నమోదుకు సహకరించాలని అధికారులు కోరారు. ఈసమావేశంలో ఎంఏసీలు శశికుమార్, వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్‌గౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్, మాజీ ఎంపిటిసిలు మేకల నర్సింగ్‌రావు, బేతాల నర్సింగ్‌రావు, మాజీ కౌన్సిలర్ చందుపట్ల వెంకట్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కొంతం బాల్‌రెడ్డి, నాయకులు, బిఎల్‌ఏలు పాల్గొన్నారు.

## రేపు గోదాదేవి లక్షగాజుల ఉత్సవం

**ఘట్‌కేసర్, జులై 17, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేత మన్నారు రంగనాయకస్వామి దేవ స్థానంలో ఆదివారం గోదాదేవి/అండాళ్‌తల్లి లక్షగాజుల ఉత్సవం నిర్వహి స్తున్నట్లు ఆలయ ధర్మకర్త పవనాచార్యులు తెలిపారు. అమ్మవారికి మొదటిసారి ప్రత్యేకంగా ఆషాడమాసంలో జరిగే ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఆదివారం ఉదయం 10 గంటలకు గజవాహన సేవ, 11 గంటలకు లక్షగాజుల ఉత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు కుంకుమార్చన, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. రంగమన్నార్‌నాయక స్వామి ఆలయం అండాళ్ అమ్మవారే స్వయంగా గాజులు వేయించుకున్న దివ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిందని, భక్తులు తమశక్తి కొద్ది గాజులు సమర్పించుకొని ఆయన కోరారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

## పంట మార్పిడిని ప్రోత్సహించండి

**వికారాబాద్, ప్రభాతవార్త :** రైతులు పంట మార్పిడి సాగును చేసుకునేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నాబార్డ్ ఫౌండేషన్, భాగస్వామి పక్షాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ, రైతులు చిరుధాన్యాలు, పప్పు దినుసుల పంటల సాగుకు ప్రోత్సహించాలన్నారు. ఎల్‌ఈనో ప్రభావం వల్ల వర్షాలు తక్కువ కురిసే అవకాశం ఉన్నందున నీటి ఆధారిత పంటలను సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. పండ్లు, కూరగాయలు, ఉద్యానవన పంటల సాగుపై అవగాహన కల్పించడంతోపాటు సాంకేతికతను ఉపయోగించి పంటల ఉత్పత్తిని పెంచుకునే విధంగా రైతులకు సూచనలు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. నాబార్డ్ ద్వారా వ్యవసాయ రంగానికి వివిధ పథకాలకు సహకారం అందిస్తుందో రైతులకు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాలు మహిళా శక్తి రైతు సేవ కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలను విక్రయించినట్లయితే రైతులకు నమ్మకంతో పాటు సంఘాలకు ఆదాయం చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ ఫామ్ పంట సాగుకు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ ఫామ్ పంట సాగు వల్ల 30 సంవత్సరాల వరకు ఆదాయం ఉంటుందని, అంతర్ పంటలు సాగు చేసుకోవడానికి అవకాశము ఉంటుందనే విషయాన్ని రైతులకు సూచించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సత్తార్, డిఆర్డిఓ శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, నాబార్డ్ డీడీఎం అఖిల్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ రిజిస్ట్రేషన్ డ్రైవ్ పోస్టర్ ఆవిష్కరణ

**వికారాబాద్, ప్రభాతవార్త :** కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మై భారత్–విక్షిత్ భారత్ ఇంటెన్సివ్ యూత్ రిజిస్ట్రేషన్ అవేర్‌నెస్ డ్రైవ్ పోస్టర్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారికంగా ప్రారంభించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట చారి, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డిఓ) వాసు చంద్ర, ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గట్టు, వికారాబాద్ జిల్లా మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ బసుత్కర్, మై భారత్ సిబ్బంది సభ్యుడు శ్రీశైలం యాదవ్ సమక్షంలో ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లా యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, దేశ నిర్మాణం, స్వచ్ఛంద సేవ, నైపుణ్యాభివృద్ధి, యువత భాగస్వామ్య కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. విక్షిత్ భారత్ దార్శనికతకు దోహదపడే అర్థవంతమైన అవకాశాలతో యువతను అనుసంధానించడమే ఈ రిజిస్ట్రేషన్ డ్రైవ్ లక్ష్యమని ఆయన చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నమోదు, అవగాహన కార్యక్రమాన్ని ఘన విజయం సాధించేందుకు విద్యాసంస్థలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద కార్యకర్తలు మద్దతును అందించాలని ఆయన తెలిపారు.

## బైక్ అదుపుతప్పి ఇద్దరు స్నేహితుల దుర్మరణం

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 17, ప్రభాతవార్త :**

ఇద్దరు స్నేహితులు బైక్ పై వెళ్తుండగా అదు పు తప్పడంతో పిల్లర్ని ఢీకొని మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధి లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లాకు చెందిన అఖిలేష్ యాదవ్ ( 24) కెపిహెచ్‌బి కాలనీలోని ఓ హాస్పిటల్‌లో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తూ హాస్టల్లో నివాసం ఉంటున్నాడు. గురువా రం అర్ధరాత్రి దాటిన తర్వాత స్నేహితుడైన మహ్మద్ యునెస్ (26) ఇద్దరు కలిసి బైక్ పై జేఎన్టీయూ నుండి కూకట్‌పల్లి వైపుకు వెళుతుండగా కూకట్‌పల్లి భాగ్య నగర్ బస్ స్టాప్ దగ్గర బైకు అదు పుతప్పి పిల్లర్ నెంబర్ 746 నుండి కొట్టడంతో కిందపడి వారి ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అందులో అఖిలేష్ యాదవ్ అక్క డికక్కడే చనిపోగా వెనకాల కూర్చున్న యునుస్ అంబులెన్స్ ద్వా రా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షి ంచి చనిపోయాడని తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## తొమ్మిదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 17, ప్రభాతవార్త :** కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 9వ తరగతి చదువుతున్న ఓ 14 ఏళ్ల విద్యార్థిని ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మూసాపేట్‌లోని ఎస్‌ఎం మోడల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని గురువారం తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటన సమయంలో ఆమె పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు నరేష్‌తో వీడియో కాల్లో ఉన్న ట్లు ప్రాథమిక సమాచారం వెల్లడైంది. ప్రాథమిక దర్యాప్తులో భాగం గా, విద్యార్థిని కొంతకాలంగా ఉపాధ్యాయుడితో వాట్సాప్‌లో చా టింగ్ చేసినట్లు, గురువారం ఇన్స్టాగ్రామ్‌లో కొత్త ఖాతా తెరిచి అ క్కడ కూడా సందేశాలు పంపినట్లు పోలీసులు గుర్తించారు. వీడియో కాల్ సందర్భంగా విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడు తుండగా ఉపాధ్యాయుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి నట్లు తెలుస్తోంది. వారు ఇంట్లోకి వెళ్లి చూడగా విద్యార్థిని ఉరివేసు కుని కనిపించినట్లు సమాచారం. ఘటన స్థలానికి చేరుకున్న పోలీ సులు ఆధారాలు సేకరించారు. విద్యార్థిని మొబైల్ ఫోన్‌ను స్వాధీ నం చేసుకుని పరిశీలించగా ఉపాధ్యాయుడితో చాటింగ్ ఉన్నట్లు గుర్తించారు. అయితే వాట్సాప్ చాటింగ్‌కు సెక్యూరిటీ పాస్వర్డ్ ఉండ టంతో డిజిటల్ ఆధారాలను విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఉపా ధ్యాయుడితో ఉన్న సంబంధమే తమ కుమార్తె ఆత్మహత్యకు కారణమ ని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఉపాధ్యాయుడు నరేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## రేపు మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

**షాద్‌నగర్, జులై 17, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ అమరవీరుల స్థూపం, మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పి. వెంకట్ రాంరెడ్డి పిలుపునిచ్చారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు తెలంగాణ అమరవీరుల స్థూపం, మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా షాద్‌నగర్‌లోని తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను భావితరాలకు చాటిచెప్పేలా ఈ స్థూపం నిలుస్తుందని అన్నారు. అలాగే తెలంగాణ ఉద్యమానికి, సమాజాభివృద్ధికి విశేష సేవలందించిన మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కూడా చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు, విద్యావంతులు, మేధావులు, తెలంగాణవాదులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పి. వెంకట్ రాంరెడ్డి కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఆర్ల యాదయ్య యాదవ్, రవికుమార్ గౌడ్, గాదె సుధాకర్, మేకల వెంకటేష్, కోకన్వీనర్ జాంగారి రవి, కుడుముల మల్లేష్, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్ రద్దుచేస్తా

(మొదటి పేజీ తరువాయి)

నియమించాలని కలెక్టర్ తెలిపారు. శిక్షణ సర్వేయర్లకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టేలా చూడాలన్నారు. పారితోషకాన్ని సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏడి సర్వేకు జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం శిక్షణ పొందిన సర్వేయర్లకు నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి నియామక పత్రాలను అదనపు కలెక్టర్ వెంకటచారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గుట్టూర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి మధుసూదన్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ బుచ్చయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## అందెశ్రీ స్మృతివనం అభివృద్ధికి రూ.3.95 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతామని వారు తెలిపారు. రాజ కీయాలకు అతీతంగా ఘట్ కేసర్‌ను అభివృద్ధి చేసు కోవాలని భవిష్యత్తులో ఈప్రాంతానికి మరింత ప్రాముఖ్యత ఏర్పడే అవ కాశం ఉంటుందని పేర్కొన్నారు. సిఎం పర్యటనలో మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలు పాల్గొని విజయ వంతం చేయాలని వజ్రేష్ యాదవ్ కోరారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్, పోచా రం, ఎదులాబాద్ డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, కర్రె రాజేశ్, సామల అమరేందర్, మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్‌గౌడ్, డిసిసి కార్యదర్శి మామిండ్ల ముత్యాలుయాదవ్, గడ్డి అన్నారం మార్కెట్ డైరక్టర్ చిల్కూరి మచ్చేందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు అబ్బసాని యాదగిరియాదవ్, మెడబోయిన వెంకటేశ్, వేముల సంజీవగౌడ్, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మాజీ కౌన్సిలర్ కడపొల్ల మల్లేశ్, మాజీ ఎంపిటిసిలు కందుల కుమార్, నర్రి శ్రీశైలం, మాజీ వార్డుసభ్యులు విబి.వెంకటనారాయణ, కొరుబోతు నాగరాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, కె.వినోద్‌కుమార్, నాయకులు ముల్లి జంగయ్యయాదవ్, సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఉల్లి అంజనేయులు, బర్ల రాధాకృష్ణ, కేశవపట్నం అంజనేయులు, మెట్టు గణేశ్‌యాదవ్, అబ్దుల్‌ఖయ్యూమ్, బొక్క సత్తిరెడ్డి, కె.సుధాకర్ పాల్గొన్నారు.

## దర్గా బచావో - డంపింగ్ యార్డ్ హటావో

(మొదటి పేజీ తరువాయి)

యార్డ్ ప్రతిపాదనతో జహంగీర్ పీర్ దర్గా పరిసర ప్రాంతాల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నందున అన్ని వర్గాలను ఏకం చేసి ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ ఉద్యమానికి కృష్ణ మహేష్ ప్రజాసేన ఆల్ ఇండియా అధ్యక్షుడు ఎండి ఖాదర్ గోరి మద్దతు ప్రకటించారు. మైనార్టీ నాయకుడిగా, ప్రజాసేన అధ్యక్షుడిగా జహంగీర్ పీర్ దర్గా పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమానికి సంపూర్ణ సంఘీభావం తెలుపుతూ తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎల్లారం శేఖర్ రెడ్డి, ఆగిరి రవికుమార్ గుప్తాలను కలిసి తన మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా ఎండి ఖాదర్ గోరి మాట్లాడుతూ, దేశ నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు దర్శించుకునే హజ్రత్ జహంగీర్ పీర్ బాబా దర్గా సమీపంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దర్గా పరిసర ప్రాంతం పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజల మనోభావాలను, ముఖ్యంగా మైనార్టీ భక్తుల భావాలను గౌరవిస్తూ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ అంశంపై ప్రత్యేకంగా స్పందించి, మైనార్టీల ఆందోళనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎండి ఖాదర్ గోరి విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, రేపు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎల్లారం శేఖర్ రెడ్డి ప్రకటించారు. జహంగీర్ పీర్ దర్గా నుంచి వేలాది మంది భక్తులు, దర్గా ప్రాంత ప్రజలు, పరిసర గ్రామాల ప్రజలతో కలిసి కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఇనుముల నర్వ ప్రాంతంలో ఎండి ఖాదర్ గోరి, కొత్తపేట ఉస్మాన్, అక్రమ్ తదితర నాయకులతో సమావేశమై ఉద్యమ కార్యాచరణపై చర్చించారు. మైనార్టీ వర్గాల తరఫున సంపూర్ణ మద్దతు అందిస్తామని, దర్గా పరిరక్షణ కోసం అన్ని విధాలుగా సహకరిస్తామని వారు హామీ ఇచ్చారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఉద్యమం ఇప్పుడు రైతులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలను దాటి ఆధ్యాత్మిక క్షేత్రాల పరిరక్షణ అంశంగా మారుతుండటంతో ఈ ఉద్యమం మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## కరాటేలో శంకర్‌పల్లి విద్యార్థుల ప్రతిభ

**శంకర్‌పల్లి, జులై 17, ప్రభాతవార్త :** పి ఎం శ్రీ మోడల్ స్కూల్, కళాశాల శంకర్‌పల్లి విద్యార్థులు కరాటేలో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. తమ పాఠశాల కళాశాలకు చెందిన విద్యార్థులు ఏప్రిల్ 26 న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం హైదరాబాద్‌లో విజన్ మార్షల్ ఆర్ట్స్ వారు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ మహాకరాటే ప్రదర్శనను నిర్వహించారన్నారు. ఈ కరాటే ప్రదర్శనలో 1212 మంది కరాటే యోధులు పాల్గొన్నారు. 20 నిమిషాల పాటు ఆగకుండా జరిగినా ఈ కరాటే ప్రదర్శనలో శంకర్ పల్లికి చెందిన పి ఎం శ్రీ మోడల్ స్కూల్ కాలేజ్ విద్యార్థులు ఎల్. రవీందర్ కరాటే మాస్టర్ శిక్షణలో ఈ మహా కరాటే ప్రదర్శనలో పాల్గొనడం జరిగింది. ఈ మహా కరాటే ప్రదర్శన చేసిన 60 రోజులకు సర్టిఫికెట్స్ మరియు మెడల్స్ పొందడం జరిగింది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ పొందిన విద్యార్థులు వి. భవ్య శ్రీ 10వ తరగతి, వి. భవిత శ్రీ 10వ తరగతి, సిహెచ్. ప్రణతి 8వ తరగతి. ఎం సృజన్ 10వ తరగతి. ప్రిన్సిపల్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ మరియు మెడల్స్ శాలువాతో సన్మానించారు. క్రమంలో కరాటే మాస్టర్ రవీందర్. గంగాధర్, టీచర్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దు

**శంషాబాద్, జులై 17, ప్రభాతవార్త :** బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందనినర్కుడ సర్పంచ్ శేఖర్ యాదవ్ హామీ ఇచ్చారు. రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని, ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శంషాబాద్ మండలం బహదూర్‌గూడ రెవెన్యూ పరిధిలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం భూసేకరణ జరుగుతున్న నేపథ్యంలో రైతులకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని బహదూర్‌గూడ సర్పంచ్ శేఖర్ యాదవ్ తెలిపారు.

దళారులు, రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేసే వారి మాటలను నమ్మొద్దని సూచించారు. రైతుల్లో అనవసర భయాందోళనలు సృష్టించి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పదేళ్ల పాలనలో రైతుల సమస్యలను పట్టించుకోని వారు, ఇప్పుడు రైతుల పట్ల ఆందోళన వ్యక్తం చేయడం రాజకీయ అవకాశవాదమేనని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు రైతులపై చూపుతున్న శ్రద్ధ కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని, గతంలో జిల్లాకు మంత్రిగా పనిచేసిన సబితా ఇంద్రారెడ్డి రైతుల కోసం చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు.


సర్ పత్రాలను అందజేస్తున్న చెన్నకేశవులు

## ఓటు హక్కును బాధ్యతతో స్వీకరించాలి

-మాజీ కౌన్సిలర్ శెట్టిమల్ల చెన్నకేశవులు

**ఆమనగల్లు, జులై17, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైనదని, దానిని సద్వినియోగం చేసుకుని దేశ, ప్రాంతాభివృద్ధికి దోహదపడాలని ఆమనగల్లు మున్సిపాలిటీ 14వవార్డు మాజీ కౌన్సిలర్ శెట్టిమల్ల చెన్న కేశవులు అన్నారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న సర్ ప్రక్రియను అర్హులైన ప్రతి ఒక్కరూ బాధ్యతతో స్వీకరించి ఎన్నికల సంఘానికి సహకరిం చాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టణంలోని 186 బూత్‌లో శుక్రవారం శెట్టిమల్ల చెన్నకేశవులు ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో పాలుపంచుకున్నారు. సర్ విధి విధానాలు వివరించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటరు తమ వివరాలను పరిశీలించుకుని అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం విధించిన నిర్ణీత గడువులోగా తమ వివరాలను బిఎల్ఓలకు అందజేసి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, బీఎల్ఓ స్వరూప, నాయకులు షార్ఫొద్దిన్, గౌస్, వీరయ్య, చంద్రయ్య, రాములు, విష్ణు, ఫిరోజ్, ఎకుల శ్రీను, శెట్టిమల్ల రమాలీల, చెన్నమ్మ, మాధవి, నీరజ, ఇస్తారమ్మ తదితరులు పాల్గొన్నారు.

### విశ్వబ్రాహ్మణ వడ్రంగి సంఘం అధ్యక్షుడిగా రామాంజనేయులు

**ఆమనగల్లు, జులై17, ప్రభాతవార్త:** ఆమనగల్లు విశ్వబ్రాహ్మణ వడ్రంగి సంఘం నూతన అధ్యక్షులుగా నాగోజు రామాంజనేయులు ఎన్నికయ్యారు.

పట్టణంలోని బ్రహ్మంగారి దేవాలయం ఆవరణలో సమావేశమైన సంఘం సభ్యులు నూతన కార్యవర్గానికి ప్రత్యేక ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల కమిటీ గౌరవ అధ్యకులు తల్లోజు వెంకటయ్యాచారి ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ సంఘం తాజా మాజీ అధ్యక్షులు తల్లోజు విజయకృష్ణ కూరెళ్ళ నయనాచారి పరిశీలకులుగా వ్యవహించారు. అధ్యక్ష పదవికి నాగోజు రామాంజనేయులు, గన్నోజు వెంక టాచారి, చెన్నోజు పుల్లయ్యాచారి పోటీ పడగా సంఘం సభ్యులు 55 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో నారోజు రామాంజనేయులు నాయకత్వానికి 31 మంది అనుకూలంగా ఓట్లు వేశారు. ఈమేరకు నూతన అధ్యక్షున్ని శాలువా, పూలమాలలతోఓ సత్కరించారు. కార్యక్రమంలో జంగయ్యాచారి, యాదగిరి, రామకృష్ణ, బ్రహ్మం, అశోక్, రవి, శ్రీను, వేణు, సంతోష్, జీవన్, మాధవాచారి, నరసింహాచారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అంతర్జాతీయ న్యాయ దినోత్సవం


న్యాయమూర్తిని సన్మానిస్తున్న అండేకర్ యాదిలాల్

**ఆమనగల్లు, జులై17, ప్రభాతవార్త:** ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని న్యాయవాదులు ఘనంగా జరుపుకున్నారు. ఆమనగల్లు బార్ అసోషియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పెద్దఎత్తున న్యాయవాదులు హాజరైనారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆమనగల్లు ప్రాథమిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈమేరకు న్యాయవాదులు ప్రత్యేక కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం జడ్జీ నారం అరుణ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థతో సమాజం లో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. న్యాయం పొందినప్పుడే కోర్టుల పట్ల ప్రజలకు విశ్వాసం పెంపొందుతుందని చెప్పారు. ఈసందర్భంగా ఆమనగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తిని, సూపరిండెంట్ మురళీధర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్ గారిని శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యక్షులు శేఖర్, సంయుక్త కార్యదర్శి మధుగౌడ్, కోశాధికారి మల్లేష్, గ్రంథాలయ కార్యదర్శి గణేష్ గౌడ్. క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులు దేవేందర్‌గౌడ్. సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, మల్లేష్ గౌడ్, దుద్దు ఆంజనేయులు, న్యాయవాదులు రామకృష్ణ, జగన్ గౌడ్, మల్లేష్, ఆంజనేయులుగౌడ్, శ్రీనివాస్, మహేశ్వర్, శ్రీశైలం, శివశంకర్, శిరీష, శైలజ తదితరులు ఉన్నారు.

### సీతారాంపూర్ భూనిర్వాసితులకు ప్లాట్లు కేటాయించి మౌలిక వసతులు కల్పిస్తాం


సీతారాంపూర్లో అధికారులను నిలదీస్తున్న భూనిర్వాసితులు

చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డి

**షాబాద్, జులై 17, ప్రభాతవార్త :** సీతారాంపూర్ భూనిర్వాసితులకు ప్లాట్లు కేటాయించి మౌళిక వసతులు కల్పిస్తామని చేవెళ్ల ఆర్డీవో పార్థసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సీతారాంపూర్ లోని సర్వేనెంబర్ 1663 నుండి 1673 వరకు ఉన్న 1148 ఎకరాల భూమిని ప్రభుత్వం పరిశ్రమలకు కేటాయించడం తో భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లు పంపిణి కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భూమికి సంబంధించిన పరిహారంతో పాటు బోర్లు, కట్టడాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించిన పరిహారాన్ని కూడా ఇప్పటికే చెల్లించామన్నారు. భూనిర్వాసితులకుకేటాయించిన 121 గజాల ప్లాట్ల విషయంలో మిగిలే విస్తీర్ణంపై కూడా తగిన నిర్ణయం తీసుకుని పారదర్శకంగా కేటాయింపులు చేపడతామని అన్నారు. భూనిర్వాసితులకు కేవలం ప్లాట్లు మాత్రమే కాకుండా వెంచర్లో ఉండాల్సి రోడ్లు, అం డర్‌డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి మౌళిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని హామి ఇచ్చారు. ప్రతిరైతుకు అనుకూలమైన స్థలం దక్కేలా జాగ్రత్తలె తీసుకున్నామన్నారు. 60 గజాల ప్లాట్ల కేటాయింపునకు సంబందించి ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ మార్గదర్శకాలు, రైతుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకొని లాటరీ విధానంలో కేఆయింపు చేపడుతామని అన్నారు. ముందు వెంచర్లో మౌళిక వసతులు కల్పించి, లాటరీ విధానాన్ని తీయాలని రైతులు డిమాండ్ సీతారాంపూర్ భూసేకరణ అయిన తరువాత నలుగురు తహసీల్దార్లు, నలుగురు ఆర్డీవోలు, నలుగురు జిల్లా కలెక్టర్లు, ఒక సీఎం మారారు కానీ మా సమస్య మాత్రం ఇప్పటికి పరాష్కారం కాలేదంటూ భూనిర్వాసితులు ఆవేదన చెందారు. తమ భూములను ప్రభుత్వం అవసరాల కోసం అప్పగించి ఎన్నో సంవత్సరాలు గడిచిన, ఇప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు పూర్తి కాలేదని రైతులు ఆరోపించారు. ప్లాట్ల కేటాయింపు, బోర్లు, చెట్లు పరిహారం వంటి అంశాల్లో ఇంకా స్పష్టమైన కనిపించకపోవడంతో రైతులు అసం తృత్తి వ్యక్తం చేశారు. అధికారులు మారినప్పుడల్లా సమస్యలు పరిష్కారం అవుతున్నాయని ఆశించిన ప్రతి కొత్త అధికారి హామీలకే పరిమితమయ్యారిని రైతులు తెలిపారు. స్థానికులకే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇప్పుడు పరిశ్రమల్లోకి కనీసం ఊరిపేరు చెబితేనే రానివ్వడం లేదని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకు భూసేకరణ నుండి అందవలసిన అన్ని అందే వరకు మాకు ప్లాట్లు వద్దని రెవెన్యూ అధికారులను గ్రామం నుండి వెళ్లిపోమని చెప్పారు. అనంతరం కొందరు సర్పంచులు షాబాద్ తహసీల్దార్ అన్వర్ మాట్లాడి అందుబాటులో ఉన్న భూనిర్వాసితులకు షాబాద్ ఎంపిడివో కార్యాలయంలోని సమావేశ మందిరంలో లాటరీ ద్వారా రైతులకు ప్లాట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిటీ రవికుమార్, సీతారాంపూర్ సర్పంచ్ పావనిచెన్నయ్య, మల్లారెడ్డిగూడ సర్పంచ్ సబితగోవర్ధన్ రెడ్డి, పోతుగల్సర్పంచ్ నర్సింహులు, లక్ష్మారావుగూడ సర్పంచ్ కుమార్, పోలారం సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, సంబందిత అధికారులు, వివిధ గ్రామాల భూనిర్వాసితులు పాల్గొన్నారు.

## నెరవేరిన దశాబ్దాల కల బొదునంపల్లికి బస్సు సౌకర్యం

**కేశంపేట ,జులై 17, ప్రభాతవార్త :** బొదునంపల్లి గ్రామ ప్రజల దశాబ్దాల నాటి బస్సు కష్టాలకు ఎట్టకేలకు తెరపడింది. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవ, సర్పంచ్ ఎదురి నాగేశ్వర్ నిరంతర కృషి ఫలితంగా గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. శనివారం గ్రామానికి చేరుకున్న మొదటి బస్సుకు గ్రామస్తులు, మహిళలు మంగళహారతులతో, బాణసంచా కాల్చి ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ. ఎన్నో ఏళ్లుగా రవాణా సౌకర్యం లేక విద్యార్థులు, రోగులు, వ్యాపారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, తక్షణమే స్పందించి బస్సు నడిపించిన ఎమ్మెల్యే శంకర్ కు , దీనికోసం ప్రత్యేకంగా శ్రమించిన గ్రామ సర్పంచ్ ఎదురే నాగేశ్వర్ కు గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.


సర్పంచ్ ఎదురి నాగేశ్వర్

తీరిన రవాణా కష్టాలు బస్సు సౌకర్యంతో ముఖ్యంగా పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు, నిరుపేదలకు ఎంతో లబ్ధి చేకూరనుంది గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ముఖ్య నేతలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని సర్పంచ్ నాగేశ్వర్‌ను ఘనంగా సన్మానించారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**కొడంగల్ రూరల్, జులై 17, (ప్రభాతవార్త):** విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలంగాణ యాంటి నార్కోటిక్స్ బ్యూరో డిఎస్పి పుష్పల్‌కుమార్, ఎస్సై సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ లక్ష్య సాధనతో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. అనంతరం స్థానిక నర్సింగ్ కళాశాలలో జూన్ 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు నర్సింహారెడ్డి, స్వర్ణలత, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పించిన డిఎస్పి పుష్పల్‌కుమార్, ఎస్సై సత్యనారాయణ

## గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా!

**కొందుర్గు, జులై 17, (ప్రభాతవార్త):** గ్రామాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి అన్నారు. గురువారం నాడు ఆయన మండల పరిధిలోని పులుసు మామిడి గ్రామంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో నిర్మించ తలపెట్టిన సిమెంట్ రోడ్ నిర్మాణం పనులకు సర్పంచ్ చేగూరి అమర్నాథ్ రెడ్డితో కలిసి 5 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టే సిసి రోడ్ నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాలతో పాటు గ్రామాలను అభివృద్ధి చేయాలని ఆశయంతోనే ఎమ్మెల్యే శంకర్ గ్రామాల అభివృద్ధి కోసం భారీగా నిధులను కేటాయిస్తు న్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జహంగీర్, నరేందర్, రాఘవేందర్, చంద్రయ్య, శంకర్ ఎ. ఇ.మధు తదితరులు పాల్గొన్నారు.



## ప్రస్తుతం ఆరుతడి పంటలు వేసుకోండి


మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని

**తలకొండపల్లి, జులై 17, (ప్రభాతవార్త):** ప్రస్తుతం రైతులందరూ వరి పంటకు బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని తలకొండపల్లి మండల వ్యవసాయ అధికారిని రేణుక చక్రవర్తిని అన్నారు. శుక్రవారం నాడు తలకొండపల్లి మండల కేంద్రంలో వరి వద్దు ఆరితడి పంటలు ముద్దు అనే అంశంపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వాన కాలంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు చూడాలని ప్రస్తుతం ఎలినోను సందర్భంగా వర్షాలు కురువకపోవడంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉన్నందున ఆరు తడి పంటలు వేసుకోవాలని ఆమె సూచించారు. ఎకరాకు వరి సాగుకు బదులుగా 2.5 ఎకరాలు ఆరు తోటి పంటలు వేసుకొని లాభాలు అర్జించాలన్నారు. కంది పెసర మినుము జొన్న మొక్కజొన్న కూరగాయలు తదితర పంటలకు తక్కువ నీటి లభ్యతకు వ్యవసాయం చేసుకునే అవకాశం ఉందని వీటన్నిటిని రైతులు గమనించాలని అమే సూచించారు. తక్కువ పెట్టుబడి త్వరితగతిన ఆదాయం, భూసార పెరుగుదల మార్కెట్ ధర తదితర లాభాలు ఉన్నందున రైతులందరూ ఆరుతాడు మండల వైపు మల్లాలని ఆమె సూచన చేశారు .ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు .

## నిరుద్యోగ హామీలపై కాంగ్రెస్‌ను నిలదీసిన బిఆర్ఎస్

-యువ సంగ్రామ సదస్సుకు యువత భారీగా తరలిరావాలని

ఎమ్మె సత్యనారాయణ పిలుపు

**కొత్తూరు, జులై 17, (ప్రభాతవార్త):**

ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ విమర్శించారు. మాజీ మంత్రి కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపు మేరకు శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న యువ సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం కొత్తూరు పట్టణంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మెండే కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక కార్యక్రమంలో ఎమ్మె సత్యనారాయణ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగుల ఆశలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు యువతను నిరాశకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని హామీలు ఇచ్చి, ఇప్పటివరకు వాటిని అమలు చేయకుండా యువతను మోసం చేసిందన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జరిగే యువ సంగ్రామ సదస్సుకు నియోజకవర్గంలోని యువత, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వద్దే బాలయ్య, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు బ్యాగరి సత్తయ్య, జంగయ్య యాదవ్, బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేశాల జైపాల్, మండల యూత్ అధ్యక్షుడు కడల శ్రీశైలం, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్ నాయక్, సీనియర్ నాయకులు మధుసూదన్ రావు, గుండు సురేష్, అశోక్, జంగయ్య, దయ్యాల పాండు, మోహన్ నాయక్, రఘు నాయక్, వద్దే మహేష్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేతలు

## జలసిరితోనే గ్రామాలకు సంపూర్ణ జల సంరక్షణ

-ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి

-కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శులకు దిశా నిర్దేశం

**కేశంపేట జిల్లా, 17, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలోనూ భూగర్భ జలాల పెంపునకు, జల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి పిలుపు నిచ్చారు. కేశంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేశంపేట మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కార్యదర్శులకు కీలక దిశా నిర్దేశం చేశారు. లక్ష్యాల సాధన జల సంరక్షణ పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకూడదని అన్నారు. కార్యాచరణ లో భాగంగా గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం, నీటి వనరుల పునరుద్ధరణను వేగవంతం చేయాలి.

**ప్రజా భాగస్వామ్యం:**

నీటి పొదుపుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి. కలెక్టర్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, నిర్దేశిత గడువులోగా జలసిరి పనులను పూర్తి చేసి మండలాన్ని జలసమృద్ధిగా మార్చాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రీ దయానంద్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ప్రోగ్రామింగ్ అధికారి అజీజ్ అహ్మద్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఏ పీ ఎం కవిత, సర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్లు మరియు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి

### ఎన్టీఆర్ విగ్రహానికి రంగులు వేయించిన కాంగ్రెస్ నేతలు

**మేడ్చల్, జులై 17, ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధి సోమారం గ్రామంలోని తివంగత నేత, మాజీ సిఎం ఎన్టీఆర్ విగ్రహాన్ని శుభ్రపరచి కాంగ్రెస్ నేతలు రంగులు వేయించారు.

రంగులు వేసిన అనం తరం శుక్రవారం పూలమాలలు సమర్పించారు. గ్రామం ముందు ఉన్న ఎన్టీఆర్ విగ్రహం రంగులు వెలిసిపోయి ఉండటంతో సామాజిక బాధ్యతగా పార్టీలకతీతంగా ఈ రంగులు వేయించామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నేతలు శ్యామ్ రావు, నరసింహ యాదవ్, హను మండ్ల సురేష్, బందెల ముత్యాలు, రమేష్, సిహెచ్ శ్రీనివాస్ యాదవ్, నురుగని బిక్షపతి యాదవ్, లోకేష్ , గ్రామ యువకులు పాల్గొన్నారు.


సోమారం గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి రంగులు వేయించి పూలమాలలు సమర్పించిన కాంగ్రెస్ నేతలు

## ఫార్మా బాధిత రైతులకు న్యాయం చేయండి

జెఎసి రాష్ట్ర నాయకులు సామా నిరంజన్

**యాచారం, జులై 17, ప్రభాతవార్త :**

రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి సమక్షంలో ఫార్మాసిటీ భూ బాధిత రైతులు గురువారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుని కలవడం జరిగిందని చెప్పుకోవడం అవాస్తవమని జెఎసి రాష్ట్ర నాయకులు సామనిరంజన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..వాస్తవానికి యాచారం మండలంలోని నాలుగు గ్రామాల ఫార్మాసిటీ భూబాధిత రైతులు మంత్రి శ్రీధర్ బాబుని, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి గారిని కలువలేదు అన్నారు. అసలు ఫార్మా వ్యతిరేక కమిటీకి ఎలాంటి సమాచారం లేదని ఫార్మా వ్యతిరేక కమిటీ తరఫున ప్రధాన డిమాండ్లు ఫార్మాసిటీకి ఇవ్వని రైతుల భూములను ఫార్మా భూనోటిఫికేషన్ నుంచి తీసివేయాలన్నారు. ఈ నాలుగు గ్రామాల అంటే కురిమిద్ద, తాటిపర్తి, నానక్ నగర్ , మేడిపల్లి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రతి ఊరికి 500, 600 ఎకరాల భూములను వదిలివేయాలని ,రైతు కూలీలకు, కుల వృత్తుల వారికి, గ్రామాలపై ఆధారపడినటువంటి ఇతర వృత్తుల వారికి ప్రతి ఇంటికి కోటి రూపాయలు కేటాయించాలని గతంలో సేకరించిన భూములలో ఫార్మా కంపెనీలను ,ఇతరత్రా కాలుష్య కంపెనీలను ఏర్పాటు చేయవద్దుఅని, ఫార్మ రైతులు కోదండ రెడ్డిని కలిసి ఇవ్వని భూములకు పరిహారం పెంచడం, ఇంకా ఇవ్వని రైతుల భూములు ఉంటే ల్యాండ్ పూలింగ్‌కు ఒప్పుకున్నారని అవాస్తాలు ఒక దినపత్రికలో రాయడం జరిగిందని ఆరోపించారు. కానీ ఏ ఒక్క రైతు కలవలేదు. ఈ ప్రభుత్వానికి ఫార్మా రైతు వ్యతిరేక కమిటీ తరఫున ముఖ్య విన్నపము ఫార్మా రైతుల కమిటీ అభిప్రాయాలను, సూచనలు తీసుకోవడానికి ఈ రెండు మూడు రోజులలో ఎమ్మెల్యే, కలెక్టర్ సమక్షంలో చర్చలు జరిపి ఫార్మా భూ బాధిత రైతుల సమస్యలు తీర్చాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

### మాల్ గ్రామ శాఖ అధ్యక్షునిగా దొంతగోని శ్రీకాంత్

**యాచారం, జులై 17, ప్రభాతవార్త :**

యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ నియామక పత్రాలను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీశైలం ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. కమిటీ నూతన అధ్యక్షులుగా దొంతమోని శ్రీకాంత్ గౌడ్ ,ఉపఅధ్యక్షుడిగాపాక భాస్కర్ యాదవ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా దేరంగుల రమేష్‌లకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ. .గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతకు కృషి చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడపగడపకు తీసుకెళ్లాలి. అర్హులందరికీ రెండో ధఫా ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అందిస్తాం ,కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పనిచేయాలి అన్నారు. నియామక పత్రాలు అందుకున్న కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీకాంత్ ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే వారికి దిశా నిర్దేశం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. ప్రతి పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. పార్టీ ప్రతిష్ట గురించి పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కొరకు పని చేసే నాయకులకు,యి కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామంలో నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని, అంతే కాకుండా పార్టీ బలోపేతానికి అహర్నిశలు పనిచేయాలని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, గొరారం వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ పడకంటి శేఖర్ గౌడ్, చీర శేఖర్, మాజీ ఎంపీటీసీ లక్ష్మీ మపతి గౌడ్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పాశం జయ ప్రకాష్(జగన్), ముంత గణేష్, కొప్పుల వెంకటేష్, వరికుప్పల తిరుమలేశ్, మాజీ 4వ వార్డు సభ్యుడు దేరంగుల్ల కృష్ణ, పెల్లీ దేవాధర్, మాస బాలరాజు, గిరి గాలయ్య, దేరంగుల్ల ఈశ్వర్ ,సోపరి శ్రీనివాస్, కలకొండ పర్వతాలు, కలకొండ మల్లేష్, పాల మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎల్‌నినో ప్రభావానికి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి

: రవినాథ్

**యాచారం, జులై 17, ప్రభాతవార్త :**

స్వల్ప వర్షాభావ పరిస్థితుల వలన రైతులందరూ ప్రత్యామ్నాయ పంటలు పండించాలని యాచారం మండల వ్యవసాయ అధికారి రవినాథ్ సూచన చేశారు. ప్రస్తుతం యాచారం మండలంలో అధికంగా పత్తి, జొన్న , వరి, కూరగాయలు పంటలు సాగులో ఉన్నాయని ప్రస్తుత ఎల్‌నినో వాతావరణ పరిస్థితులు, వర్షాభావం , నిరంతర డ్రై స్పెల్ కారణంగా పత్తి, జొన్న, మొక్కజొన్న పంటలు తీవ్ర తేమ ఒత్తిడికి గురవుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో మొక్కలు భూమి నుండి నీరు, పోషకాలను గ్రహించే సామర్థం తగ్గుతుంది. దీనిని అధిగమించడానికి పైపాటుగా (ఫోలియర్ స్ప్రే ) ఎరువులు పిచికారీ చేయడం అవసరం అన్నారు. స్ప్రే చేయవలసిన ఎరువులు 2 యూరియ, 1 పొటాషియం నైట్రేట్ 19:19:19 - ఎకరాకు 1 కేజీ లేదా 13:0:45 - ఎకరాకు 1 కేజీనానో యూరియా+ నానో డిఏపి ఎకరానికీ ఒక లీటర్‌పై ఎరువులను సూచించిన మోతాదులో నీటిలో కలిపి మొక్కల ఆకులపై సమానంగా పిచికారీ చేయాలి అని తెలిపారు. దీనివల్ల ఆకుల ద్వారా పోషకాలు త్వరగా గ్రహించబడతాయి. మొక్కలు స్ట్రెస్ పరిస్థితులను కొంతవరకు తటుకుంటాయి. వర్షాభావం వల్ల కలిగే దిగుబడి నష్టాన్ని కొంత మేర తగ్గించుకోవచ్చు అన్నారు. రైతులు ఈ సూచనలను పాటించి పంటలను సంరక్షించుకోవాలని వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేస్తోంది పేర్కొన్నారు.

### ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలి

షాబాద్ మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర

**షాబాద్ :** వానాకాలం2026లో ఎల్‌నినో ప్రభావంతో జూలై 31 నుంచి ఆగస్టు 15 వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముందని, రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని షాబాద్ మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర సూచించారు. తక్కువ వర్షపాతం, నేలలో తేమ తగ్గడం, అధిక ఉష్ణోగ్రతలు, ఆలస్యంగా వర్షాలు ప్రారంభమయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని అత్యవసర (కాంటింజెన్సీ) పంట ప్రణాళికను విడుదల చేశారు. ఇంకా విత్తనాలు వేయని రైతులు కనీసం 50 నుంచి 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాత మాత్రమే కంది, పెసర, మినుము, అలసంద, జొన్న, సజ్జ, కొర్రలు, రాగులు, నువ్వులు, ఆముదం వంటి స్వల్పకాలిక, తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు. మొక్కజొన్న పంటలో తేమ కొరత ఉంటే కొత్తగా విత్తకూడదని, ఇప్పటికే సాగులో ఉన్న పంటల్లో కలుపు నివారణ, తగిన తేమ ఉన్నప్పుడే యూరియా పైపూత, మల్చింగ్ ద్వారా తేమ సంరక్షణతో పాటు ఫాల్ ఆర్మీవార్మ్‌ను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. వరి పంటను నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో మాత్రమే సాగు చేయాలని, నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పప్పుధాన్యాలు లేదా చిరుధాన్యాలను ఎంచుకోవాలని సూచించారు. పత్తి పంటలో గ్యాప్ ఫిల్లింగ్ పూర్తి చేయడం, కలుపు నియంత్రణ, తెల్లదోమ, జాసిడ్‌లు, తామర పురుగులపై నిఘా ఉంచాలని, తేమ కొరతలో అధిక నత్రజని ఎరువులు వేయరాదని పేర్కొన్నారు.

పప్పుధాన్యాలకు విత్తన శుద్ధితో పాటు రైజోబియం, పీఎస్‌బీ వంటి జీవ ఎరువులు ఉపయోగించాలని, సజ్జ, జొన్న, కొర్ర, రాగులు వంటి చిరుధాన్యాలు తక్కువ వర్షపాతాన్ని తట్టుకుని మంచి దిగుబడిని ఇస్తాయని వివరించారు. రైతులు తేమ సంరక్షణ కోసం అంతర దుక్కులు, మల్చింగ్, కలుపు తొలగింపు, వర్షపు నీటి నిల్వ చర్యలు చేపట్టాలని, నేల పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువులు వాడాలని సూచించారు. పురుగులు, తెగుళ్ల నివారణకు వారానికి రెండుసార్లు పంటను పరిశీలించి, అవసరమైన స్థాయిలో మాత్రమే పురుగుమందులు వినియోగించాలని, పసుపు, నీలం స్టిక్కీ ట్రాప్స్ ఏర్పాటు చేసి సమగ్ర పురుగు నివారణ పద్ధతులు పాటించాలని తెలిపారు. వర్షాలు సాధారణ స్థాయికి రాకపోతే వరి, మొక్కజొన్న కొత్త విత్తనాలు వేయకుండా కంది, ఆముదం, సజ్జ, జొన్న, కొర్ర వంటి పంటలను సాగు చేయాలని, వర్షాలు మెరుగుపడితే స్వల్పకాలిక వరి రకాలు, పప్పుధాన్యాలను సాగు చేయవచ్చని సూచించారు.



## వర్షం కురవాలని ప్రత్యేక ప్రార్థనలు

**జిల్లేడు చౌదరి గూడెం, జులై 17, ప్రభాతవార్త:** జిల్లేడు చౌదరిగూడ మండలంలో వర్షాలు కురవాలని శుక్రవారం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని తూంపల్లి గ్రామంలో గల పారదేశ్ బాబా దర్గా వద్ద వర్షం కురవాలని కోరుతూ జమే మషీద్ కమిటీ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ ఆఫీస్‌తో పాటు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో పేకాటరాయుళ్ళు

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**పెద్దేముల్, జులై 17, ప్రభాతవార్త:** పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని పట్టుకున్న సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం మారెపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న సమాచారం తెలుసుకున్న పోలీసులు పేకాట స్థావరంపై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న బోయిని నర్సిములు, చాకలి రాజు, మక్బూద్, ఖలీం, శ్రీనివాస్‌రెడ్డి, నర్సిములు, బస్వపురం నర్సిములు, చంద్రశేఖర్‌రెడ్డి, చాపల హన్మప్పలు ఉండగా అందులో ఐదుగురిని అదుపులోకి తీసుకోగా, మరో ఐదుగురు వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.6120 నగదు, ఐదు సెల్‌పోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రజలు ఎలాంటి చట్ట విరుద్ధ కార్యకలాపాల సమాచారం తెలిసిన వెంటనే పోలీస్‌స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

## పేకాట రాయుళ్ళ అరెస్టు

**మర్పల్లి యస్.ఐ అబ్దుల్ రహూఫ్**

**మర్పల్లి, జులై 17, ప్రభాతవార్త:** మర్పల్లి మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. యస్.ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి, మర్పల్లి మండలంలోని తుమ్మలపల్లి గ్రామ శివారులో కోమటి రాజు పొలం వద్ద పేకాట అడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని, వారివద్దనున్న 25,840 రూపాయలు స్వాధీనం చేపుకుని వారిపై కేసు నమోదు చేయడం జరిగిందనీ యస్.ఐ తెలిపారు.

## అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించాలి

**జిల్లా పంచాయతీ అధికారిణి డాక్టర్ జయసుధ**



లక్ష్మీ నగర్ తండాలో షెడ్ స్థలం కోసం పరిశీలిస్తున్న డిపిఓ డాక్టర్ జయసుధ

**ధారూర్, జులై 17, ప్రభాతవార్త:** ధారూర్ మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జిల్లా పంచాయతీ అధికారిణి డాక్టర్ జయసుధ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నగర్ తండా నూతన గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రతిపాదించిన సెగ్రిగేషన్ షెడ్ నిర్మాణ స్థలాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ధారూర్ గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న ఆమె, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, పాలనలో పారదర్శకతను పాటించాలని కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో భాగంగానే స్థానిక అంగన్వాడీ కేంద్రంతో పాటు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి వసతులను పరిశీలించారు. అనంతరం ఎస్ఐఆర్ పై పలు సూచనలు చేస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి ఆజ్య నాయక్, సర్పంచ్ పూజ, ఉప సర్పంచ్ గణేష్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన సర్పంచ్

**నందిగామ, జులై 17, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో



నందిగామ బస్ స్టాప్ వద్ద టాయిలెట్ వాష్ రూమ్ నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన సర్పంచ్.

శుక్రవారం ప్రయాణికుల ,బాట దారుల సౌకర్యార్థం నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు ఆర్టీసీ బస్టాండ్ ముఖ్య కూడలిలో టాయిలెట్స్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ము కృష్ణ మాట్లాడుతూ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారి అండ దండలతో నందిగామ ముఖద్వారంలో ప్రయాణ ప్రాంగణం ఏర్పాటు చేశారని,త్వరలోనే పబ్లిక్ టాయిలెట్స్, వాష్ రూమ్‌లు నిర్మాణ పూర్తి చేస్తామని, ప్రయాణికులకు,బాట సారులకు, ప్రభుత్వకార్యాలయాలకు పనులకోసం వచ్చే పోయే వారికి, ఇబ్బందులు తలెత్తకుండా పబ్లిక్ టాయిలెట్స్,వాష్ రూమ్ లు నిర్మాణ చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ నర్సింలు, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, శివగల్ల ప్రవీణ్, శివవగళ్ల సురేష్, బొమ్మగళ్ళ నర్సింలు, సరిత మురళి, చిరసాని సుమలత నర్సింహులు, టైలర్ కృష్ణ, నాయకులు అగ్గి అంజయ్య గౌడ్,బి జంగయ్య, బి,కృష్ణ యాదవ్,ఎర్రగారి రమేష్,కావలి నర్సింలు, ఏకుల అంజయ్య,పబ్బతి కరుణాకర్,పి బాల్ రాజ్ ,శివగల్ల సుమన్, రహమత్ అలీ, కేశమోని రామచంద్రి,బొమ్మగళ్ల లింగం,కాంట్రాక్టర్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## హిమాయత్ సాగర్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**శంషాబాద్ జులై 17, ప్రభాతవార్త :** హిమాయత్ సాగర్ వెనుక వైపున ఓ గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. చెన్నమ్మ హోటల్ దగ్గర గల మస్జిద్ సమీపంలో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే ఘటనస్థలానికి చేరుకొని నీళ్లలో తేలాడుతున్న గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసు కున్నారు. అతని వయసు 40-45 సంవత్సరాలు ఉంటుందని చేపలు పట్టడానికి వచి ప్రమాదవశాత్తు నీళ్లలో పడి చనిపోయి ఉండచ్చుని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.మృతదేహాన్ని ఉస్మానియా హాస్పిటల్ మార్చురీ కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.ఎవరైనా తెలిసిన వాళ్ళు ఉంటే ఆర్‌జిఐఎ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

# వారాహి రూపంలో వెలసిన పోచమ్మ తల్లి



వారాహి రూపంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీపోచమ్మ తల్లి

**భక్తులతో కిక్కిరిసిన శ్రీరామ్‌నగర్**

**జవహర్‌నగర్, జులై 17 ,ప్రభాత వార్త:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్‌నగర్ శ్రీరామ్‌నగర్ కాలనీలో గల పోచమ్మతల్లి దేవాలయ ప్రాంగణంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు రెండో రోజు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల తొలి రోజున అమ్మవారు వారాహి దేవి అలంకరణలో భక్తులకు దివ్య దర్శనం ఇవ్వగా, రెండోరోజైన శుక్రవారం వారాహిమాత స్వరూపంలో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మునిగాల సతీష్ కుమార్ మాట్లాడుతూ, అమ్మవారు వారాహి దేవి అలంకరణలో భక్తులకు దివ్య దర్శనం ఇస్తున్నారని, ఆమె కృపాకటాక్షాలతో జవహర్‌నగర్ ప్రజలతో పాటు జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. అమ్మలగన్న అమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ పోచమ్మ తల్లేనని పేర్కొంటూ, వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ఆమె అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు, పసుపు కుంకుమలు స్వీకరించారు. ఉత్సవాల సందర్భంగా శ్రీరామ్‌నగర్‌తో పాటు పరిసర ప్రాంతాలు పండుగ శోభతో కళకళలాడాయి.

# వానదేవుడి రాకకోసం శివాలయంలో ఘనంగా జయంతి

**పూడూరు, జులై 17, ప్రభాతవార్త :** పూడురు మండల పరిధిలోని కద్మూరు గ్రామ శివాలయంలో వాన దేవుడి రాకకోసం గత వారం రోజులుగా జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం చివరి రోజు ముగింపు సందర్భంగా ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన భజన కార్యక్రమంలో గ్రామానికి చెందిన భక్తులు భారీ ఎత్తున పాల్గొని చిరుతల రామాయణం,రాకంచెర్ల వెంకట దాసులవారి సంకీర్తనలను ఆలాపించారు. ఈ సందర్భంగా చిన్న,పెద్ద తేడా లేకుండా కులమతాలకు అతీతంగా భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు నృత్యాలు చేశారు. అనంతరం ఆలయంనుండి గ్రామ శివారులో ఉన్న హనుమాన్ మందిరానికి భజనలు చేస్తూ,దండకాలు వేస్తూ, కొబ్బరికాయలు కొడుతూ భారీ ఎత్తున ర్యాలీగా వెళ్లి బొడ్రాయికి అభిషేకం చేసిన అనంతరం (వరద పాశం)వరద పాయసాన్ని సమర్పించగా,స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కద్మూరు,మిట్టకంకల్ గ్రామాలనుండి భక్తులు భారీసంఖ్యలో పాల్గొనగా,ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.



పూడూరు మండలం కద్మూరులో వరద పాయసం సమర్పణకోసం బయలుదేరిన భక్తులు

# రోడ్డు పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

**..జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ధారాసింగ్**

**పెద్దేముల్, జులై 17, ప్రభాతవార్త:** రోడ్డు పనులను నిర్ణిత గడువులోగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని వికారాబాద్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ధారాసింగ్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్‌తాండా -ఇందూరు- దారుణివాగుతాండా వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన రహదారులు అందించాలనే లక్ష్యంతో ఈ పనులను చేపడుతుందని అన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులను మరింత వేగ వంతం పూర్తిచేసేలా చూడాలని అన్నారు. పనుల నాణ్యతలో స్థానిక ప్రజలు కూడా సూచనలు ఇవ్వాలని అన్నారు. రోడ్డు పనులు పూర్తయితే రవాణ సౌకర్యం మెరుగుపడి ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తిచేసి ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ధారాసింగ్

# బోగస్ ఓటుకు తావులేకుండా జాబితా సిద్ధం చేయాలి

**కోట్‌పల్లి, జులై 17, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను బీఆర్ఎస్ పార్టీ తాండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీశైల్‌రెడ్డి క్షేత్రస్థాయిలో శుక్రవారం నాడు పర్యవేక్షి ంచారు. కోట్‌పల్లి మండల కేంద్రంలోని 33, 34 ,35, మూడు పోలింగ్ బూత్‌లతో పాటు అన్నాసాగర్, ఓగ్లాపూర్ గ్రామాల బూత్‌లను సందర్శించి ఎన్యూమరేషన్ ప్రక్రియను సమీక్షించారు. ప్రతి బూత్‌లో బిఎల్ఓ, బిఎల్ఏతో ప్రత్యేకంగా సమావేశమైన కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య, మ్యాపింగ్ ప్రక్రియ, ఇంటింటి సర్వే పురోగతి, పెండింగ్ దరఖాస్తులు, బూత్‌ల వారీగా పూర్తి అయిన శాతం వంటి అంశాలపై సవివరంగా ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకోని వాటి పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి ఓటరు జాబితానే మూలస్తంభం అని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చూడడం ఎంత ముఖ్యమో, బోగస్ ఓట్లకు అవకాశం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించడం కూడా అంతే బాధ్యతన్నారు.ఎన్యూమరేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదన్నారు. ప్రతి ఇంటికి చేరుకుని అర్హులైన వారందరినీ నమోదు చేయాలని. ప్రజల్లో అవగాహన పెంచి, ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ప్రతి బూత్‌ను వంద శాతం పూర్తి చేసిన బూత్‌గా తీర్చిదిద్దాలని వారు పిలుపునిచ్చారు. పర్యటన సందర్భంగా స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో ఆత్మీయంగా సమావేశమైన గ్రామాల్లోని పరిస్థితులు, ప్రజల అభిప్రాయాలు, స్థానిక సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్యూమరేషన్ ప్రక్రియ విజయవంతం కావడానికి కృషి చేయాలని సూచించారు. కోట్‌పల్లి మండలంలో ఐదు బూత్‌ల పర్యటనతో బూత్‌ల వారీగా జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా సమీక్షి ంచి పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో పర్యటనలు కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు, అనంతరం బీఆర్ఎస్‌పార్టీ సీనియర్ నాయకులు అమర్‌నాథ్ రావు సతీమణి ఇటీవల మరణించిన నేపథ్యంలో, వారి నివాసానికి వెళ్లి అమర్‌నాథ్ రావును మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉప్పరి మహేందర్, కోట్‌పల్లి మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, కోట్‌పల్లి గ్రామ కమిటీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, సీనియర్ నాయకులు మల్లేశం, లాలప్ప, యువ నాయకులు సంతు కుమార్, అన్నాసాగర్ కృష్ణ, బుగ్గాపురం వెంకటయ్య, ఎల్లప్ప, జగన్ చారి తదితరులు పాల్గొన్నారు.



కోట్‌పల్లి మండల కేంద్రంలో ఓటరుల జబితాను పరిశీలించిన బీఆర్ఎస్ పార్టీ తాండూర్ నియోజకవర్గం ఇంచార్జీ శ్రీశైల్‌రెడ్డి,

# నిందితుడు నాగేందర్‌కు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండు

**మోమిన్‌పేట్, జులై 17, ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండలం బూర్గుపల్లి గ్రామానికి చెందిన మన్నె నాగెందర్ (40) అనే వ్యక్తిని 14, రోజుల జ్యుడీషియల్ రిమాండుకు పంపినట్లు ఎస్ఐ భరత్ బూషణ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.....గతంలో అతనిపై ఒక కేసు నమోదు కాగా అట్టి కేసుకు సంబంధించి ఇటీవల వికారాబాద్ కోర్టులో ఫిర్యాదుదారుడు, వారి కుటుంబ సభ్యులు నిందితుడికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడంతో, వారిపై కక్ష పెంచుకున్న నిందితుడు నాగేందర్ ఈ నెల 13వ, తేది రాత్రి ఫిర్యాదుదారుడి ఇంటివద్దకు వెళ్లి అసభ్య పదజాలాలతో దూషిస్తూ, ఆపై గొడ్డలి తీసుకుని చంపేస్తానని తీవ్రంగా బెదిరించాడు. స్థానికులు సమయానికి స్పందించి అడ్డుకోవడంతో ప్రమాదం తప్పిందని ఎస్ఐ అన్నారు. ఈ నేపథ్యంలో బాధితుడి ఫిర్యాదు మేరకు మోమిన్ పేట్ ఎస్ఐ భరత్ భూషణ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టగా గురువారం సాయంత్రం మోమిన్‌పేట్ నూతన ఆంటిసి ప్రయాణ ప్రాంగణ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని, ఆపై వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వికారాబాద్ గౌరవనీయ కోర్టులో హాజరు పరుచగా, న్యాయస్థానం నిందితుడికి 14, రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.



పోస్కో నిబంధనల మేరకు బాధితురాలి రక్షణ మరియు గోప్యతను కాపాడేందుకుగాను భాదితురాలిపేరు, కుటుంబ సభ్యుల పేర్లు పూర్తిగా గోప్యంగా ఉంచడం జరిగిందని ఎస్ఐ భరత్ భూషణ్ తెలిపారు.

# జులై 26 డంపింగ్ యార్డు సదస్సును విజయవంతం చేయాలి

**జవహర్‌నగర్, జులై 17, ప్రభాతవార్త:**
జవహర్‌నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డును వెంటనే ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోమటి రవి డిమాండ్ చేశారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర 7వ రోజుకు చేరుకోగా, శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోమటి రవి మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలు, ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న రాంకీ చెత్త డంపింగ్ యార్డుపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. డంపింగ్ యార్డు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై జులై 26న నిర్వహించనున్న భారీ సదస్సును ప్రజలందరూ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.కీసర సర్కిల్ పరిధిలోని మల్కారం, ఫరానగర్ తదితర ప్రాంతాల్లో సీపీఎం నాయకులు, పోరాట కమిటీ కోకన్వీనర్ శివన్నారాయణ అధ్యక్షతన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జులై మొదటి వారం నుంచే డంపింగ్ యార్డు ప్రభావిత గ్రామాలు, కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు, పాదయాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు.స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలను కలిసి డంపింగ్ యార్డు ఎత్తివేత ఉద్యమంలో భాగస్వాములను చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు బాధితులు, ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున సదస్సుకు హాజరై ఉద్యమానికి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్, కోకన్వీనర్లు టి.శంకర్, అనురాధ, గడ్డం సదానందం, వై.మల్లేష్, ఆర్.నర్సింహం గౌడ్, పి.శివబాబు, సూర వెంకటయ్య, అరుణ, ప్రవీణ్, స్వరూప, లక్ష్మీబాయి, భారతి, చంద్రమోళి, విజయ్, అల్లూరి సావిత్రి, కొన్నెవేణు, వెంకట్, బంగారు నర్సింగరావు, బాలు, వెంకన్న, విజయ్ కుమార్, కర్నె సురేందర్, మారెపల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే ప్రియ శిష్యుడికి అరుదైన గౌరవం

**నందిగామ, జులై 17, ప్రభాతవార్త :** అభివృద్ధి సంక్షేమ పథకాల స్ఫూర్తి ప్రదాత , షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు అత్యంత సన్నిహితుడు, కష్టజీవి, కాంగ్రెస్ పార్టీ అంటే ప్రాణమిచ్చే నాయకుడు. నందిగామ మండలం వెంకమ్మగూడ గ్రామానికి చెందిన వడ్డే శ్రీనుకు అరుదైన గౌరవం లభించింది. వెంకమ్మగూడ గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా వడ్డే శ్రీను నియమితులు కావడం పట్ల కాంగ్రెస్ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం లభించింది. నందిగామ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా వడ్డె శ్రీను,ఉపాధ్యక్షులుగా కుమ్మరి సాములయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా గుండాల శేఖర్ లను ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో విశ్వాసంతో అధ్యక్షునిగా నియమించినందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ అగ్ర నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగ నరసింహులు, సర్పంచ్ గొర్లపల్లి అశోక్, మాజీ సర్పంచ్ కావలి కృష్ణ, వార్డు మెంబర్ నరసింహులు, పసుల బుచ్చయ్య, కాంగ్రెస్ సీనియర్ నేతలు బుయ్యని వీరేందర్ గౌడ్, గుండాల వేణు, సాములయ్య, శ్రీను, వెంకమ్మగూడ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఎఇ వెంకటేష్**

**మోమిన్‌పేట్, జులై 17, ప్రభాతవార్త:** నేడు మోమిన్‌పేట్ మండల పరిధిలోని ఎన్కతల సబ్‌స్టేషన్ 33 /11 కేవి నందు 11 కేవి ఎన్కతల ఫీడర్ పరిధిలో కొమ్మలు తొలగించడం జరుగుతుందని మోమిన్‌పేట్ విధ్యుత్ ఏఈ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వైర్ల కిందనున్న చెట్ల కొమ్మలను తొలగించడం, చిన్నచిన్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9,గంటల నుండి సాయంత్రం 5, గంటల వరకు విధ్యుత్ అంతరాయం జరుగుతుంది. కనుకా విధ్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది. దేవరంపల్లి, చక్రంపల్లి, చీమల్‌దరి, బాల్‌రెడ్డి గూడం గ్రామాల విధ్యుత్ వినియోగదారులు గమనించి సహకరించగలరని ఆయన కోరారు.

## మేడ్చల్ సిఐగా అంజిరెడ్డి

**మేడ్చల్, జులై 17, ప్రభాతవార్త :** మేడ్చల్ సిఐగా అంజిరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తాజాగా సిఐల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా మేడ్చల్ సిఐగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ బదిలీపై వెళ్లగా శేరి లింగంపల్లి ఎస్ఓటీలో విధులు నిర్వహిస్తున్న అంజిరెడ్డి బదిలీపై వచ్చి మేడ్చల్ సిఐగా బాధ్యతలు తీసుకున్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మేడ్చల్ సిఐ అంజిరెడ్డి

## ప్రతి ఒక్కరూ ఇకెవైసి చేయించుకోవాలి

**జిల్లేడు చౌదరి గూడెం, జులై 17, ప్రభాతవార్త :** ంషన్ కార్డులో ఉన్న ప్రతి ఒక్క సభ్యుడు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డులో ఉన్న సభ్యులు ఈ నెల ఆఖరి వరకు ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు ఈ కేవైసీ చేయించుకోకపోతే రేషన్ కార్డు నుంచి పేరు తొలగించే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. జిల్లా ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఈ కేవైసీ డీలర్ వద్ద చేయించుకోవాలని సూచించారు .

## ఘనంగా గోరింటాకు పండుగ



**జిల్లేడు చౌదరి గూడెం, జులై 17, ప్రభాతవార్త:** జిల్లేడు చౌదరిగూడ మండలంలోని రావిర్యాల గ్రామంలో గోరింటాకు పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆషాడ మాసం సందర్భంగా మహిళలు సాంప్రదాయ వస్తువులు ధరించి గోరింటాకుతో అలంకరించుకున్నారు. అలాగే తమ ఇళ్లల్లో పిండి వంటలు చేసుకుని సమిష్టి భోజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ జిల్లా ఓబిసి అధ్యక్షుడు మహేందర్ యాదవ్‌కు ఘన సన్మానం

**జవహర్‌నగర్, జులై 17 ,ప్రభాత వార్త:** మేడ్చల్ రూరల్ జిల్లా భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన మహేందర్ యాదవ్‌ను మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు. పార్టీ విస్తరణ కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కమల్, జోగారావు, పార్టీ సీనియర్ నాయకులు సంతోష్ గుప్తా, లిఖిత యాదవ్, యాదగిరి, ఓబీసీ మోర్చా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరుగురి ఆత్మలకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ

**షాబాద్, జులై 17, ప్రభాతవార్త :** షాబాద్ మండలంలోని షాబాద్, దైవాలగూడలో నరహంతకుడి చేతిలో మృతి చెందిన ఆరుగురి ఆత్మలకు శాంతి చేకూరాలని మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని మ సిద్దెంగూడ గ్రామంలో సర్పంచ్ పర్వేద నర్సింహులు, మాజీ సర్పంచ్ కుర్వ జయమ్మసుదర్శన్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్నం అవినాష్ రెడ్డి మాట్లాడుతూ... అన్యం పున్యం ఎరుగని ఇద్దరు చిన్న పిల్లలను చంపడానికి నరహంతకుడికి చేతులు ఎలా వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎం పీటీసీ లక్ష్మీ, ఉపసర్పంచ్ శివకుమార్, నాయకులు నర్సింగ్రావు, ప్రభాకర్రెడ్డి, పాపిరెడ్డి, సురేష్, సుధాకర్, శ్రీశైలం, శివయ్య, జంగయ్య, శేఖర్, ఖాజా, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతం కొరకు కృషి చేయాలి

**ఘట్‌కేసర్ రూరల్, జులై17, ప్రభాతవార్త:** ప్రజలకు ప్రభుత్వానికి మధ్యన వారధిగా కాంగ్రెస్ కార్యకర్తలు పనిచేసి పార్టీ బలోపేతం కొరకు కృషి చేయాలని పోచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ అన్నారు. పోచారం డివిజన్ పరిధిలోని చౌదరిగూడ, మక్త, ప్రతాప సింగారం, ముత్వెల్లిగూడ, కాచవాని సింగారం గ్రామాల్లో డివిజన్ అధ్యక్షుడు రాజేశ్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించి పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో జరిగిన కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయడం ప్రతి కార్యకర్త బాధ్యతయని అన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా ఐకమత్యంతో, అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కర్రె జంగమ్మ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఇటిక్యాల కృష్ణారెడ్డి, డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేశ్ యాదవ్, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, బాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గాంధారీ లక్ష్మీనారాయణ, నాయకులు భోజిరెడ్డి, పసులాది నర్సింగ్‌రావు ముదిరాజ్, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు ఏర్ర రాజు, ఎస్సీ సెల్ మాజీ మహిళ అధ్యక్షురాలు ఏర్ర మాధవి, భాగ్య, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. వినోద్, కొంతం శంకర్‌రెడ్డి, బి. నగేశ్ గౌడ్, కర్రె అశోక్, అనసూయ, వరలక్ష్మి, ఐలేశ్, సగ్గు శ్రీను, బిఎన్. రెడ్డి, ఎం. వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.